# నేను నిలిచిన చోట

వి. పద్మ



సాయంకాలం అయిదు గంట లయింది. రాత్రి భోజనాల కోసం వంట ప్రయత్నాలు చేస్తూ గృహిణు లందరూ హడావిడిగా ఉండే సమయం.

వర్ధనమ్మ చేతిలో చాట ఉంది. అందులో రాళ్ళు ఏరవలసిన బియ్యం ఉన్నాయి. కానీ ఆవిడ చూపులు చాటలోని బియ్యం మీద లేవు.

సిమెంటు చప్టా చేసిన దొడ్లో కెవ్వున కేకలు పెడుతూ, పరుగులు తీస్తూ గంతులు వేస్తూన్న పిల్లల ఆటపాటల మీద లేవు.

రివ్వున వీస్తున్న చల్లటిగాలికి హాయిగా తల ఊపుతూన్న వేపచెట్టు మీద కూర్చుని ఆహ్లాదంగా ఉన్న వాతవరణానికి పరవశిస్తూ పక్షులు చేస్తున్న కిలకిలారావాల మీద లేవు.

కనీనం - తనకు కొద్ది దూరంలోనే నులకమంచం మీద కూర్చుని, దళసరి కళ్ళద్దాలు పెట్టుకుని రామకోటి రాసుకుంటూ, మధ్యలో గొంతు పొలమారగా, "ఏమేవ్ ! కాస్త మంచితీర్థం తెచ్చిస్తావూ?" అంటున్న భర్త మీద కూడా లేవు.

అసలు ఆవిడ మనస్సే అక్కడ లేదు. మనస్సును అనుసరించమని మెదడు జారీ చేసిన ఆర్డరు ననుసరించి, ఆమె కళ్ళూ, చెవులూ ఆమె మనస్సు చూస్తున్న వైపుకే దృష్టిని నిలిపాయి.

ఆమె చూస్తోంది-

తమ ఇంటి ముందునుంచి చక్కగా ముస్తాబై 'మాకు వేరే బాధ్యతలు లేవు సుమా' అని చెప్పకనే చెబుతూ నడుచుకుంటూ వెళుతూన్న ఒక వృద్ధ జంటని.

వర్ధనమ్మ వాళ్ళని ఇంతక్రితం ఎన్నోసార్లు రాముల వారి కోవెలలో చూసింది. సాయంత్రం కాస్త చల్లబడడం ఆలస్యం - ఇద్దరూ చిలకాగోరింకల్లాగా ముస్తాబై చెట్టాపట్టాలు వేసుకుని అలా షికారుకి బయలుదేరుత రు.

వీళ్ళేకాదు - ఇంకా చాలామందిని చూసింది తను. పిల్లల పెళ్ళిళ్ళు, పురుళ్ళూ - పుణ్యాలూ ముగియడం ఆలస్యం, వాళ్ళ బాధ్యతలన్నీ తీరిపోయినట్లే. "ఒంట్లో పూర్తిగా ఓపిక నశించాక ఇంకేం తిరుగుత?" అంటూ పుణ్యక్షేత్ర లన్నీ దర్శిస్తారు. హాయిగా, స్వేచ్ఛగా బ్రతుకుత రు.

హుఁ- త మూ ఉన్నారు, ఎందుకూ? కాకిలా నూరేళ్ళు బ్రతికేకంటే, హంసలా ఒక్క రోజు బ్రతికినా చాలు అన్నట్లుగా, తమ జీవిత ల్లో ఒక సరదా, ఉత్సాహమూ ఏదీ లేదు. పొద్దున్నే లేవగానే - టిఫిన్లు, మధ్యాహ్నం వంట, ఈ పిల్లల అల్లర్లతో కాస్త నడుం వాల్చే అవకాశం లేకుండానే మళ్ళీ సాయంకాలం వంట మొదలు. ఇదంత ఒక ఎత్తు అయితే - ముసలితనానికి తొలి నమత్త అన్నట్లు కొడుకు పిల్లల బాధ్యత కూడా తనదే.

పొద్దున్న తొమ్మిది గంటలు కాగానే, టైమయిపోయింది - కొంపలు మునిగిపోత యి - అంటూ తను కంచంలో వడ్డించిన అన్నాన్ని నోట కొట్టుకుని, ఆఫీసుకు పరుగులు తీస్తుంది కోడలు. ఆ తరువాత ముగ్గురు 'మనవలనీ సిద్ధం చేసి, వాళ్ళ టిఫిన్ కారియర్లు సర్దిపెట్టి, వాళ్ళని స్కూళ్ళకి పంపే బాధ్యత తనదే.'

దేవుడి పూజ కానిచ్చి, భోజనాలు ముగించి, 'హమ్మయ్య' అని కాస్త ఊపిరి పీల్చుకునేలోగా, తిరిగి రావణాసురుడి సంతతిలాగా స్కూళ్ళ నుంచి దిగబడత రు పిల్లలు. వచ్చిన దగ్గరి నుంచి ఊరికే ఉంటారా? 'నానమ్మా - ఆకలేస్తుంది, అది పెట్టు, ఇది పెట్టు' అంటూ తను వచ్చేలోగానే 'వాళ్ళే స్వంత పెత్తనం చెలాయించి, 'ఇది నాది' అంటే 'నా'దని గోల ! ఆ తరువాత ముష్టియుద్ధాలూ, ఏడుపులూ మొదలు.

ఇక సాయంకాలం నాలుగు కావడం ఆలస్యం - చదువూ సంధ్యా అంటూ ఏదీ లేదు. క్రికెట్ అనీ, హాకీ అనీ బాటులూ, బంతులూ తీసుకుని, చుట్టుపక్కల ఇళ్ళలో పిల్లలతో కలిసి, దొడ్లో చేరి పోలోమని ఒకటే గోల. అంత ఒక్కచోట చేరారంటే ఇహ వీళ్ళు తోకలులేని కోతులే !

అదివరకు - ఈ దొడ్డిని సిమెంటు చేయించకపూర్వం - ఈ దొడ్లో తను ఎన్నెన్ని పువ్వుల, కూరగాయల మొక్కలు నాటిందని ! ఆ తోటని చూడడానికి రెండు కళ్ళూ చాలేవిగావు. పారిజాత లు, సన్నజాజులు, మల్లెలు, గులాబులు - ఎన్నెన్ని పువ్వులో ! సాయంకాలం అయేసరికి గుబాళిస్తూ దగ్గరకు వెళితే చాలు - ఆత్మీయంగా, చిరునవ్వుతో పలకరిస్తున్నాయా అన్నట్లుగా అనిపించేది. ఇదిగో - మనవలు ఎదిగాక ఆ మొక్కల పాలిటి యమభటుల లాగా తయారయారు.

మొగ్గ తొడగడం పాపం - తుంచి పారవేసేవాళ్ళు. దొడ్డినా, వాకిటా పడి మొక్కలన్నీ కాళ్ళతో తొక్కేస్తూ ఒకటే అల్లరి. పైగా - క్రికెట్ ఆడుకునే స్థలం లేదు అంటూ వీధిన పడేవాళ్ళు బాలూ, బాటూ తీసుకుని. రోడ్డుమీద అనుక్షణం తిరుగాడే కార్లూ, రిక్షాలూ, సైకిళ్ళను తప్పించుకుంటూ వాళ్ళు ఆడే ఆటలు చూస్తూ ఉంటే, ఏ నిమిషంలో పిల్లలకి ఏ గండం ముంచుకు వస్తుందో నని భయపడి, "వీళ్ళు ఎలాగూ మొక్కలను బ్రతకనివ్వడంలేదు గదమ్మా ! వీటిని పీకించి, దొడ్డి అంత సిమెంటు చేయిస్తే ఆ వేసే గంతులేవో 'ఇక్కడే వేస్తారు గదా?" అని అబ్బాయి దొడ్డి అంత సిమెంటు చేయించాడు. ఆ రోజుతో తీరిపోయింది తనకు ఆ మొక్కలతో బాంధవ్యం. అబ్బాయి చేసిన పని సమంజసమైనదే కాబట్టి తను దుఃఖాన్ని గొంతులోనే అదిమిపెట్టి, నోరు మూసుకుని ఊరుకుంది.

దొడ్డిని సిమెంటు చేయించిన దగ్గర నుంచి వీళ్ళు మరీ అదుపూ, అజ్ఞా

లేకుండా అయారు. ఎంతసేపూ ఆటలూ, ఇరవై నాల్గుగంటలూ ఏదో ఒక చిరుతిండితో నోరు ఆడుతూ ఉండవలసిందే. అన్నాలకు మారాం, చదువుకోమంటే మారాం- వట్టి మొండిఘటాల్లా తయారయారు.

మొన్నటికి మొన్న తన పెద్ద మనవడు - పరీక్షలో ఏదో తెలియలేదని పక్కవాడి పేపరులో చూసి రాశాట్ట - టీచరు నుంచి కంప్లెయింట్ అందుకుని కొడుకూ, కోడలూ ఇద్దరూ వాడికి బడితెపూజ చేసి శుభ్రంగా బ్రెయిన్ వాష్ చేశారు.

తమ రోజుల్లో పిల్లలు ఎంత శ్రద్ధగా చదువుకునేవాళ్ళు. పెద్దలంటే గౌరవం, టీచర్ల దగ్గర భయభక్తులతో మెలిగేవాళ్ళు. చదువే తమ ధ్యేయం అన్నట్లుగా ఉండేవాళ్ళు. తమ పిల్లలు ఎప్పుడూ ఫస్ట్ రాంక్ వచ్చేవాళ్ళు ! ఏనాడూ చదువు ఎగ్గొట్టి, పెద్దలను ఎదిరించటం లాంటి పనులు చేయలేదు. ఇప్పుడంటే - వడుచు పెళ్ళాల మైకంలో పడి ఇలా తయారయ్యారు గానీ - ఒకప్పు డయితే...

కోడలికి ఉద్యోగం వచ్చిందని ఎంతో సంతోషించింది తను. కానీ, అదే తన పాలిటి శాపంగా మారుతుందని కలలో కూడా అనుకోలేదు. ఉద్యోగంలో చేరక పూర్వం ఇంట్లో పని పాటలలో సహాయం చేసేది కోడలు. తన పిల్లల్ని తనే సరిదిద్దుకునేది. తను ఉద్యోగంలో చేరగానే ఇంటి పనిలో పీసమెత్తు సహాయం లేదు సరికదా, నెమ్మదిగా పిల్లల బాధ్యత కూడా తన నెత్తిమీదనే తోసేసింది.

"పోనీలేవే, పాపం ! కోడలు ఆఫీసులో కష్టపడి రెక్కలు ముక్కలు చేసుకుంటోంది" అంటూ ఈయన కోడల్ని వెనకేసుకొస్తారు.

హుం- అసలు వాళ్ళ పిల్లల ఆలనా పాలనా చూడవలసిన అవసరం తన కేవిటి? తన పిల్లల్ని తనే పెంచుకుంది - ఎవరి నెత్తినా ఆ బరువు మోపలేదు. అయినా - కోడలు ఉద్యోగం చేసి సంపాయిస్తే తనకేం ఒరిగిందని? ఆ వచ్చే నాలుగు జీతం రాళ్ళూ వాళ్ళ పేరనే బాంకులో నెల నెలా జమ చేస్తూ, బాంకు బాలెన్సును కొండలా పెంచుకుంటున్నారు. తన కేనాడయినా - 'నా జీతం డబ్బులతో కొన్నాను. అత్తగారూ !' అంటూ ఒక చీరగుడ్డ అయినా కొన్న పాపాన పోయిందా ఆ సంగనాచి కోడలు?

మూడు, నాలుగు నెలల క్రితం - తన వియ్యపురాలు వచ్చింది చుట్టపు చూపుగా చూసి పోవడానికి.

ఏదో పనిమీద తను దొడ్లోకి వచ్చేసరికి, అప్పటికే ఏదో విషయం గురించి సుదీర్ఘంగా చర్చించుకుంటున్నారు కాబోలు, వాళ్ళ మాటలలో ఒకటి తన చెవిన బడింది. కోడలి తల్లి మరి ఏమన్నదో ఏమో, సమాధానంగా - "ఏం చేస్తామమ్మా? నాతోటి కోడళ్ళందరూ ఏ బంధనాలూ లేకుండా సుఖంగా ఉన్నారు. నాకే చుట్టుకున్నాయి ఈ బరువు బాధ్యత లన్నీ..." అంటూ ఇంకా ఏదో అనబోతున్న కోడలు తన రాకను గమనించి టక్కున మాటలు ఆపేసింది సగంలో.

అప్పటి నుంచి తనకు కోడలి ముఖం చూడాలంటే ఏదో ఏహ్యాభావం. తను కోడలిని కూతురి కంటే ఎక్కువగా చూసుకుంది. ఆమెకి పుట్టింటి వాళ్ళ సహాయం లేదని కోడలి పురుళ్ళూ, పుణ్యాలూ కూడా తనే పోసింది. వాళ్ళ పిల్లలని పెంచే బాధ్యత కూడా తన నెత్తినే వేసుకుంది. కోడలు ఉద్యోగంలో చేరాక అబ్బాయి నెలకి 'ఇన్ని' రూపాయలు అంటూ ఇస్తున్నాడు గానీ, అంతక్రితం వాళ్ళ సంసారాన్ని కూడా తామే పోషించేవాళ్ళు.

తమ నుంచి ఇంత మేలు పొందినా కూడా, వాళ్ళ పిల్లలు పెద్దవాళ్ళయి వాళ్ళని సాకే అవసరం తీరిపోయింది కాబట్టి, ఇహ ముసలి అత్తగారూ, మామగారూ మోయలేని బరువుగా అనిపిస్తున్నారన్న మాట !

పైకి ఏమీ అనదు గానీ - ఆ పిల్ల చూపులతోనే అన్ని భావాలూ తెలియజేస్తుంది. 'ఇల్లు గడవడానికి మేము డబ్బు ఇస్తున్నాం కాబట్టి ఇంట్లో నాదే పెత్తనం' అనే అర్థం వచ్చేలా ప్రవర్తిస్తుంది.

తమ ఇంట్లో కొడుకూ, కోడలూ పైసా డబ్బులు అందనీయకుండా, ఆవిడ పెత్తనం సాగనీయకుండా నెత్తిన రాయి పెడితే, అక్కడ 'మ్యావ్, మ్యావ్' అనే పిల్లిలా తోకముడిచి, ఇక్కడికి వస్తే చాలు కూతురి సంసారం తన స్వంతం అయినట్లూ, అల్లుడు తమ మోచేతి నీళ్ళు తాగే బంటు అయినట్లూ పులిలా తమమీద పెత్తనం చలాయిస్తుంది తన వియ్యపురాలు.

కూతురికి ఏం చెప్పిందో ఏమో, అదివరకు సాయంకాలం వంట కోడలే చేసేది. ఇప్పుడు "ఆఫీసులో పని ఎక్కువగా ఉంది" అంటూ ఆ పనీ ఎగ్గొట్టేసింది. అదివరకు మామగారికి తనే కంచం పెట్టి, అన్నం వడ్డించేది. ఇప్పుడు - సరిగ్గా ఆయన భోజనం చేసే సమయానికే ఏదో పని కల్పించుకుని అవతలికి వెళ్ళిపోతోంది.

మొన్న ఒక రోజు తమ ఇంటికి రెండిళ్ళ అవతల ఉండే అవధానులుగారు వచ్చారు. తన చేతి కాఫీ తాగి ముఖం విచారంగా పెడితే, కాఫీలో ఏమైనా తేడా వచ్చిందా ఏమిటో అని తను కంగారు పడింది. ఆ మాటే పైకి అనేసింది కూడా ! అందుకు ఆయన దాదాపు ఏడ్చినంత పని చేసి, 'ఒదినగారూ ! మీ చేతి కాఫీ అమృతం ! ఇకనుంచి ఈ అమృతం తాగే అదృష్టం కోల్పోతున్నాననే బాధతో కూడిన విచారం మబ్బులా నా ముఖాన్ని అలుముకుంది" అన్నాడు.

"అయ్యో, అదేం మాట?" అంటే అప్పుడు బయట పెట్టాడు అసలు సంగతి. "ఒదినగారూ ! ఒకప్పుడు ముసలితనం వచ్చాక మనశ్శాంతి కోసం తీర్థయాత్రలు చేసి వచ్చేవాళ్ళు. ఈనాడు తీర్థయాత్రల సంగతి అటుంచి, రోగం వస్తే డాక్టరు దగ్గరకు వెళ్ళడానికి కూడా చేతిలో పైసా చిక్కడంలేదు. తన పెళ్ళాం - బిడ్డలూ - సంసారాన్ని పోషించుకోవడానికే కిందా మీదులు అవుతున్న మా అబ్బాయి, "నాన్నా ! నువ్వు - రిటైరయిపోయావు. నీకు పైసా సంపాదన లేదు. నిన్నూ అమ్మనీ తేరగా మేపే ఓపిక నాకు లేదు. కాబట్టి ఇల్లు విడిచి వెళ్ళిపోండి" అన్నాడు. కాబట్టి నేను నా భార్యతో సహా మా స్వంత ఊరైన పెంటపాడుకి వెళ్ళిపోతున్నాను. ఉన్న ఊర్లో బ్రతికి ఉంటే బలుసాకైనా తినవచ్చుననే ఉద్దేశంతో."

ఆ మాట వినిన దగ్గరి నుంచి తనలో ఏదో తెలియని దిగులు బయలుదేరింది. కోడలు ఆ రకమైన ఉద్దేశంతోనే ఉందేమోనని తనకు అనుమానంగానే ఉంది. ఎంతైనా కొడుకు వడుచు పెళ్ళాం మాటలు వినక, ముసలి తల్లిదండ్రుల మాట వింటాడా? ఏదో ఒకనాడు అబ్బాయి- "అమ్మా ! నువ్వూ, నాన్నా మూటా - ముల్లే సర్దుకుని ఎటైనా వెళ్ళిపోండి' అని పుసుక్కున అన్నాడంటే తమ పరువేం గాను?"

ఈ మధ్య ఇంట్లో జరిగే సంఘటనలు చూస్తూ ఉంటే ఆ రోజెంతో దూరంలో లేదనిపిస్తోంది కూడా తనకి.

ఇంటి వెనక దొడ్లో - తను కాపురానికి వచ్చిన కొత్తలో నాటింది జామచెట్టు. ఇప్పటికీ చెట్టునిండా కాయలతో చెక్కుచెదరకుండా, వడుచు ముత్తయిదువులా, పిల్లల తల్లిలా కళకళలాడుతూ ఉంది ఆ చెట్టు. పిల్లలందరూ ఆ చెట్టుమీదికి కోతుల్లా ఎగబాకి, కాయలు కోసుకుతింటూ ఉంటారు. తెల్లవారేసరికి చిలుకలు చిటారుకొమ్మన జేరి పండు కాయలు సగం కొరికి కింద పడేస్తూ ఉంటాయి. చిలుక కొట్టిన కాయలు 'నాకంటే నాకు' అంటూ పిల్లలు కొట్లాడుకుంటూ ఉంటారు.

ఇంత కన్నుల పండువగా ఉన్న చెట్టుమీద పడింది అబ్బాయి కన్ను. బహుశా, వెనకనుంచి కోడలి ప్రోత్సాహం ఉండే ఉంటుంది. ఒక రోజు తీరికగా పొద్దున్నే జామచెట్టు కింద కూర్చుని బ్రష్ చేసుకుంటూ, చుట్టూతా చెల్లాచెదురుగా పడిన జామ ఆకులు, పిందెల్ని చూపిస్తూ, "అమ్మా ! ఈ చెట్టు పెద్ద తలనొప్పిగా తయారయిందే ! మొన్న ఆ రెడ్డిగారి అబ్బాయి చెట్టుమీదికి ఎక్కి కింద పడ్డాడట గదా? నిన్న బజార్లో కనబడి, "ఏమయ్యా పంతులూ ! మీరు ఇంట్లో ఉండకపోయినా, మీ అమ్మ పెద్దావిడ ఇంట్లోనే ఉంటారు గదా. కాస్త పిల్లల్ని చెట్టూ, చేమా ఎక్కనీయకుండా జాగర్తగా చూడమనవయ్యా" అన్నాడు. అవమానంతో నా తల కొట్టేసినట్లయింది" అన్నాడు అబ్బాయి.

తనకి ఒంటినిండా కారం రాసుకున్నట్లయింది. ఏం? అతను ఆ మాట అనకపోతే, తన పిల్లల్ని ఇంట్లోనుండి బయటకు కదలనీయకుండా వాళ్ళ ఆవిడను కాపలా కాస్తూ ఉండమనకపోయాడా? "ఇంతకీ నువ్వేమయినా సమాధానం చెప్పావా లేదా అతనికి చెప్పుచ్చుకు ముఖాన కొట్టినట్లు?" అంది తను రోషంగా.



అబ్బాయి ముఖం గంటు పెట్టుకుని, "తప్పు మన దగ్గర ఉంచుకొని అవతలి వాళ్ళని ఏమని అంటాం?" అన్నాడు.


"అంటే?" అంది తను అనుమానంగా చూస్తూ.

అప్పుడు బయటపెట్టాడు అసలు సంగతి. 'చుట్టుపక్కల వాళ్ళతో లేనిపోని గొడవ లెందుకమ్మా మనకి? పైగా జామకాయల కోసం బయటినుండి తుంటరి వెధవలు గోడ ఎక్కి దొంగతనంగా కాయలు కొయ్యడమే కాకుండా, దొడ్లో ఏ చెంబో, గ్లాసో కనిపిస్తే కాజేసుకుపోతున్నారు. మనకి కూడా రోజూ ఈ ఆకులూ, గట్రా ఊడ్చుకోవడం అంతా నానా అవస్థగా తయారయింది. హాయిగా ఈ చెట్టును కొట్టించేసి..."

"కొట్టించేసి?" తన రక్త ప్రసరణం అంతా ఒక్కసారిగా ఆగిపోయినట్లయింది.

"కొట్టించేసి ఇక్కడ బాత్‌రూంలు కట్టించుకుందాం. ఇప్పుడు ఉన్న బాత్‌రూంలు పాత మోడల్‌వి. పైగా చీదరగా కూడా ఉన్నాయి" అంటూ మాటలు పూర్తి చేశాడు అబ్బాయి.

తన గుండె ఆ క్షణంలో ఎందుకు ఆగిపోలేదో తనకి అర్థంకాని విషయం. కానీ తనకి ఒక విషయం మాత్రం స్పష్టంగా తెలిసిపోయింది. కొడుకూ, కోడలూ ఈ తరం వాళ్ళు. తాము పాతకాలపు మనుషులు. వాళ్ళకీ, తమకీ అభిరుచుల్లో చాలా తేడా ఉంది. వాళ్ళ ఇంట్లో వాళ్ళకి 'అవసరమైనవి' అనిపించినవే ఇంట్లో ఉండాలి. అనవసరమైన వాటిని నిర్దాక్షిణ్యంగా పారేస్తారు. జామచెట్టు తనకి ఎంతటి ప్రాణ సమానమైనదో అబ్బాయికి తెలును. 'జామచెట్టును కొట్టిస్తాను' అనడంతోటే, 'దానితో పాటు ముసలికంపు కొట్టే మీ అవసరం కూడా మాకు తీరిపోయింది' అని అబ్బాయి చెప్పకనే చెప్పాడు.




తను కాపురానికి వచ్చినప్పటి నుంచీ తనకి తోడుగా, నీడగా ప్రాణస్నేహితురాలి కంటే ఎక్కువగా నిలిచింది ఈ జామచెట్టు. ఎన్నిసార్లు తనకి కష్టం వచ్చినప్పుడు, ఈ చెట్టు కిందికి వచ్చి, ఈ చెట్టుకి చెప్పుకుంటూ ఏడ్చిందో. తనని జాలిగా చూస్తూ ఓదారుస్తున్నట్లే అనిపించేది. అలాగే తమకి చెప్పలేని సంతోషం వస్తే కూడా ఈ చెట్టుకే చెప్పుకునేది. గాలికి ఊగే కొమ్మలూ, రాలిపడే ఆకులూ, తమ సంతోషంతో పాలు పంచుకుంటున్నట్లే అనిపించేది. తమ కష్టసుఖాల్లో అది కూడా నిశ్శబ్దంగా చూస్తూ భాగం పంచుకుంది. అటువంటి తన ప్రాణసఖికి అబ్బాయి పుణ్యమా అని ఈనాటికి ఈ భూమిపైన నూకలు తీరిపోతున్నాయి.

ఆ రాత్రి మంచంమీద పడుకుని నిశ్శబ్దంగా ఎలా ఏడ్చిందో తను ! 'గుండె వెయ్యి వక్కలై, అవన్నీ చెల్లాచెదురు అయినట్లుగా తన మనసులో ఏవేవో భావాలు ఎగిసిపడుతూ, వాటికి ఏకీభావం కుదరక చెల్లాచెదురు అవుతున్నట్లుగా అనిపించసాగింది.

ఆ భావాలకు సాయంత్రం - కొడుకూ, కోడలూ ఇంకా ఇల్లు చేరలేదు. పిల్లలు ఆడుకుంటున్నారు. తనకి మనస్సు బాగుండకపోవడంతో ఆయన దగ్గరకు వెళ్ళి "ఏమండీ ! నేను అలా గుడికి వెళ్ళి వస్తాను. ఇద్దరం ఒకేసారి ఇల్లు కదిలేందుకు లేదుగా. పిల్లల్ని చూస్తూ ఉండండి, అరగంటలో వచ్చేస్తాను" అంటూ ఇంటికి సమీపంలోనే ఉన్న రాములవారి గుడికి వెళ్ళింది.

ఆలయంలో ప్రశాంత వదనంతో అభయం ఇస్తున్నట్లుగా ఉన్న ఆ భగవంతుడికి దండం పెట్టుకుని, చుట్టూ ఉన్న విశాలమైన ఆవరణలో, నందివర్ధనం చెట్టుకింద కూలబడింది.

చల్లటి గాలికి హాయిగా తల తూపుతున్నాయి చెట్లు. చెట్ల మీదుగా వీచే చల్లటి గాలి, పువ్వుల సువాసనలను మోసుకు వస్తూ, మనసులో భగభగమండే ఏవో మంటలని చల్లార్చి, చందనం అందినట్లుగా చల్లదనాన్నీ హాయినీ చేకూరుస్తున్నట్లుగా ఉంది. వినీలాకాశంలో ఎగిరే తెల్లటి కొంగల బారులు నయనానందకరంగా కనిపిస్తున్నాయి.

ఎటో చూస్తూ ఆలోచిస్తున్న తను ఇంతలో "వర్ధనీ, నువ్వా?" అన్న పిలుపుకి ఉలిక్కిపడి అటు తిరిగి చూసింది.

అనసూయ - తన చిన్ననాటి స్నేహితురాలు. జుట్టు అంత నలుపూ - తెలుపుల కలగాపులగంగా ఉంది. అవును, మరి, తన వయస్సుదేగా? పక్కనే ఆమె భర్త. ఆయన కూడా వయస్సు మీరినట్లుగా కనిపిస్తున్నాడు.

ఇంతలోనే ఇద్దరూ దగ్గరగా వచ్చేశారు.

"ఏమోయ్, వర్ధనీ ! ఎంత కాలానికి కనిపించావ్? ఎలా ఉన్నావ్, ఎంతమంది పిల్లలూ, ఎందరు మనవలూ - అన్నీ చెప్పేసెయ్ గబగబా" అంది హుషారుగా తన పక్కనే కూర్చుంటూ.

తన విషయాలన్నీ విన్న తరువాత ఆమె తన గురించి చెప్పింది.

"ఇద్దరే కొడుకులోయ్. ఇద్దరూ విదేశాల్లోనే స్థిరపడి, మమ్మల్ని కూడా అక్కడికి రమ్మని గొడవ చేస్తున్నారు. మిగిలిన ఈ కాస్త జీవితం ఇక్కడే గడిపివేసి, ఈ కాస్త ప్రాణాన్నీ మాతృభూమికే అంకితం చేసేద్దామనే ఉద్దేశంతో నేనూ, మా వారూ ఇక్కడే ఉండిపోయాం. ఆయనకి నేనూ - నాకు ఆయనా లింగూ-లిటుకూ మంటూ ఒంటరిగా ఉండేకంటే ఎవరైనా కాస్త తోడూ-నీడగా ఉండేవాళ్ళకి ఇంట్లో ఒక భాగం అద్దెకి ఇస్తే బాగుండుననే ఆలోచనలో ఉన్నాం. నీకు ఎవరైనా మంచివాళ్ళు తెలిస్తే చెప్పు" అంటూ వాళ్ళ ఇంటి గుర్తులూ, అడ్రస్సూ చెప్పింది అనసూయ.

అనసూయ మాటలు విన్న దగ్గరనుంచీ తనలో ఏదో అలజడి మొదలయింది. ఇంతకు ముందు చెల్లాచెదురైన భావాలన్నింటికీ ఒక రూపం వచ్చినట్లుగా అనిపించసాగింది. ఏవో ఆలోచనలలోనే ఇల్లు చేరుకుంది.

డ్రాయింగ్ రూంలోనుంచి పెద్దగా నవ్వులూ, మాటలూ వినిపించడంతో 'ఎవరో' అనుకుంటూ, చూసీ చూడనట్లుగా తొంగి చూసింది. అబ్బాయీ, కోడలూ - వాళ్ళ స్నేహితులు కాబోలు కూర్చుని కబుర్లు చెప్పుకుంటున్నారు.

దొడ్లోకి నడిచింది కాళ్ళు కడుక్కునేందుకు. అక్కడ - చంటిదాని డ్రాయరు ఉతికి, దండెం మీద ఆరేస్తున్న భర్తను చూసి, "ఇదేమిటి? మీ రిక్కడ ఏం చేస్తున్నారు?" అంది ఆశ్చర్యంగా.

ఆయన తనవైపు నవ్వుతూ చూస్తూ, "ఏమీ లేదోయ్. చంటిది డ్రాయరు ఖరాబు చేసింది. కోడలు ఎవరో వచ్చినట్లున్నారు - హడావిడిలో ఉన్నట్లుంది. చంటిది ఎంతసేపని దొడ్లో నిలబడి ఉంటుంది? 'కాళ్ళు నొప్పులు పుడుతున్నాయి తాతయ్యా !' అని గొడవ చేసింది. నువ్వా - అరగంటలో వచ్చేస్తాను అన్న మనిషివి గంట దాటినా అయిపు లేవు. సరే, పాపం, చంటిదాన్ని బాధపెట్టడం దేనికనే ఉద్దేశంతో నేనే శుభ్రం చేసేశాను" అన్నారు.

అంతకు ముందే కాస్త సేదదీరిన మనస్సులో మళ్ళీ నన్నటి మంటలా బయలుదేరింది తనలో.

"నానమ్మా, ఓ నానమ్మా, నిన్నే ఓయ్ !" పిల్లల పిలుపులకి ఈ లోకంలోకి వచ్చి పడింది వర్ధనమ్మ.

"ఆట అయిపోయింది నానమ్మా ! ఆకలేస్తోంది. ఏమైనా పెట్టు, తినేందుకు" అంటూ గొడవ మొదలుపెట్టారు పిల్లలు.

"ఉండండిరా ఒక్క నిమిషం. నన్ను లేవనిస్తారా, లేదా?" అంది వర్ధనమ్మ చేతిలో చేట పట్టుకుని నిదానంగా లేస్తూ.

"నువ్వు లేవడానికే గంట పడుతుంది. అదే మా అమ్మ అయితేనా, ఏమైనా పెట్టమని అడిగితే నిమిషంలో తెచ్చి పెడుతుంది" అన్నాడు రెండో మనవడు నిష్ఠురంగా.

"నానమ్మ ముసలిది అయిపోయిందిరా" అన్నాడు పెద్ద మనవడు.

"చేగోడీలు ఎక్కడ ఉన్నాయో నాకు తెలుసురా అన్నయ్యా ! నేను చూపిస్తాను రండి" అంది మూడోది ఉత్సాహంగా లోపలికి పరుగుదీస్తూ. తక్కిన ఇద్దరూ దాని వెనకే పరుగెత్తుకు వెళ్ళారు.

"చూశారా, మనవలు ఏమంటున్నారో? వాళ్ళకి నా అవసరం తీరిపోయింది. 'మూల కూర్చోవే ముసలమ్మా" అంటున్నారు. అబ్బాయి, కోడలు మాత్రం ఇంకా ఈ ముసలిదాని వంట్లో ఓపిక పూర్తిగా చావలేదు. పూర్తిగా ఓపిక పోయాక అప్పుడు ఆలోచిద్దాం అని వాళ్ళ బరువూ బాధ్యతలు అన్నీ నా నెత్తిన మోపారు" అంది వర్ధనమ్మ అక్కడే కూర్చుని రామకోటి రాసుకుంటున్న భర్తతో.

ఆయన ఎప్పటిల్లా, "ఛ ! అవేం మాటలే? కోడలు వింటే ఏమయినా అనుకోగలదు !" అనలేదు. విని, ఏదో ఆలోచిస్తున్నట్లుగా ఊరుకున్నారు.

వర్ధనమ్మ పొయ్యిమీద ఎసరు పడేయడానికి లోపలికి కదిలింది.

ఆ రాత్రి - వర్ధనమ్మకు అస్సలు నిద్ర పట్టలేదు. కిటికీలో నుంచి - నల్లటి ఆకాశంలో తారలకి చిక్కకుండా వేగంగా పరుగులు తీస్తున్న చందమామవైపే సాలోచనగా చూస్తూ కూర్చుంది.

"నేను ఉండవలసిన స్థానం ఇది కాదు. నేను నిలిచిన చోట నా పేరు రాసిలేదు" అంటూ తన ఇంటికోసం వెతుక్కుంటూ చందమామ పరుగెడుతున్నట్లుగా అనిపించింది ఆవిడకి. తనకు వచ్చిన తమాషా ఆలోచనకి తనకే నవ్వు వచ్చింది.

మంచం మీద పడుకుని, నిద్ర పట్టడం కోసం న్యూస్ పేపరు చదువుకుంటూన్న ఆమె భర్త, కిటికీలో నుంచి ఆకాశం వైపు చూస్తూ తనలో తనే నవ్వుకుంటూన్న భార్య వైపు తల తిప్పి చూసి, "ఏమిటోయ్? నీలో నువ్వే నవ్వుకుంటున్నావ్?" అన్నారు.

భర్త వైపు చూసింది వర్ధనమ్మ.

ముసలితనం మూలంగా ఆయన ముఖంలో ముడతలు పడినా, సూటిగా, పొడవుగా ఉన్న ఆయన ముక్కు ఇంకా ఆయనలోని నిజాయితీని, కార్యదీక్షనీ సూచిస్తున్నట్లుగానే ఉంది. ఆయన కళ్ళు ప్రశాంతమైన కొలనుల్లాగా - ఇందాక తను గుడిలో దర్శించుకున్న రాములవారి విగ్రహాన్ని జ్ఞప్తికి తెస్తున్నాయి. ఎవరు తనని గురించి ఎన్ని విధాలుగా అనుకున్నా ఏమీ సమాధానం చెప్పకుండా, వాళ్ళని నొప్పించక తా నొవ్వక అన్నట్లు - తామరాకు మీద నీటిబొట్టులాంటి స్వభావం ఆయనది. అందుకే ఆయన మనస్సులో ఏ కల్మషం లేకుండా, ప్రశాంతంగా ఉండగలుగుతారు.

తాను ఆయనతో నలభై ఏళ్ళనుంచీ కాపురం చేస్తున్నా కూడా ఆయన లక్షణాలు కొంచెం కూడా తనకి అంటలేదు. అందుకే అన్నిటి గురించీ మంచీ-చెడూ ఆలోచించీ, తన మనస్సును బాధపెట్టి, తద్వారా తను బాధని అనుభవిస్తోంది.

ఏదో ఆలోచిస్తూ తనకి మోచేతి దూరంలో కూర్చున్న వర్ధనమ్మ చేతిమీద చేయి వేశారు ఆయన. ఆప్యాయంగా చూస్తూ, "ఏమిటోయ్, ఆలోచన? నాతో చెప్పకూడదా?" అన్నారు.

ఆ ఆప్యాయతకి ఒక్క మాటుగా కదిలిపోయింది ఆవిడ. అన్ని రోజులుగా దాచుకున్న దుఃఖం కన్నీరై స్రవిస్తూ ఉండగా, తన మనస్సులోని కష్టసుఖాలూ, తన ఆలోచనలూ అన్నీ భర్తకు విపులంగా చెప్పుకుంది వర్ధనమ్మ.

ఆయన ఎప్పటిలా తేలికగా కొట్టిపారవేయలేదు. ఆమె ముఖంలోనే చూస్తూ ఆమె మనస్సును అర్థం చేసుకోవడానికి ప్రయత్నిస్తూ ఉండిపోయారు. ఆమె ఈ వయస్సులో స్వేచ్ఛ, ప్రశాంత జీవనం కోరుకుంటోందని తెలుసుకున్నారు.

భర్త తను చెప్పిన విషయా లన్నిటికీ అంగీకరించడంతో మనస్సు తేలికగా మారింది వర్ధనమ్మకి.

కిటికీలో నుంచి చూస్తే - విశాలమైన ఆకాశంలో తన పేరు రాసి ఉన్న తన చోటి కోసం ఇంకా వెతుక్కుంటూ పరుగులిడుతూనే ఉన్నాడు చందమామ. ఇనుమడించిన ఉత్సాహంతో తనలో తనే నవ్వుకుంటూ, మంచంమీద నడుం వాల్చింది వర్ధనమ్మ.

మరునాటి ఉదయం-

జామచెట్టు కింద బ్రష్ చేసుకుంటూ, "అమ్మా ! చెట్టును కొట్టించేందుకు మనుమల్ని రేపు రమ్మన్నానే !" అంటున్న అబ్బాయికి సమాధానం చెప్పకుండా, "అబ్బాయ్, నా చిన్ననాటి స్నేహితురాలు అనసూయ ఇంట్లో భాగం ఖాళీగా ఉందటరా. భార్యా భర్తలు ఇద్దరే ఉంటున్నారట. నేనూ, మీ నాన్నా ఆ భాగంలో అద్దెకి చేరదాం అనుకుంటున్నాం" అంది వర్ధనమ్మ.

తను అడిగిన ప్రశ్నతో సమన్వయం కుదరకుండా మరేదో చెబుతూన్న తల్లి వైపు అయోమయంగా చూశాడు కొడుకు.

అర్థం అయేలా మళ్ళీ చెప్పింది వర్ధనమ్మ.

తేలు కుట్టిన దొంగలా నిశ్శబ్దంగా చూస్తూ ఉండిపోయింది కోడలు.

అప్పటికే స్నానం కానిచ్చి, శుభ్రమైన పంచె, లాల్చీ వేసుకుని, "ఏమేవ్ రెడీయేనా?" అంటున్న భర్తకి, "ఆఁ- రెడియే !" అంటూ చెప్పులు వేసుకుని, "మేము అనసూయా వాళ్ళ ఇంటికి వెళ్ళి మా నిర్ణయం చెప్పి వస్తాముర్రా, అబ్బాయ్" అని చెప్పి, కొత్తదైన 'తమ' ఇంటిలో తాము గడపబోయే స్వేచ్ఛా జీవితాన్ని ఊహించుకుంటూ, భర్తకి కొద్దిగా వెనుకగా, ఆయన నీడలో అడుగులు వేస్తూ, అనసూయా వాళ్ళ ఇంటివైపు కదిలిపోయింది వర్ధనమ్మ.

*


# కేవలం
# ఒకే ఒక 5 రూ॥లతో
# మీ అబ్బాయి / అమ్మాయి
# భవిష్యత్తుముడిపడివుంది.
# నమ్మ లేక పోతున్నారా?

మీ అబ్బాయి / అమ్మాయి
ఈ ఏడాది పదవ తరగతి చదువుతుంటే
పై మాటలు అక్షరసత్యం

**పదవ తరగతి విద్యార్థుల కోసం**

నాయుని కృష్ణ మూర్తి సంపాదకత్వంలో నెలనెలా వెలువడే

# పాఠశాల

పత్రిక కొని చదివితే
మీ చిరంజీవి ఎక్కువ మార్కులతో
ఉత్తీర్ణత సాధించే అవకాశం వుంది.

ఒక్క మార్కు ఎక్కువైనా
**భవిష్యత్తు పైన ఆ మార్కు ప్రభావం చాలావుంటుంది.**

సంశయించకండి......
**మీ చిరంజీవి భవిష్యత్తుతో పోలిస్తే**
**5 రూ॥ విలువైనవి కావు.**

నేడే కొని చదివించండి

**విడిప్రతి వెల : 5 రూ.**
**సంవత్సర చందా : 50 రూ.**

ప్రతి చందాదారుడికీ సంవర్గమాన పట్టికలు, గణిత సూత్రాలు, భౌతిక స్థిరాంకాలు, రసాయన మూలకాలు, ఇంగ్లీషు తెలుగు వ్యాకరణం కలిసిన

**పాఠశాల విజ్ఞానవాణి ఉచితం. ఉచిత పుస్తకం జూలై 30వ తేదీలోపల చందా పంపినవారికి మాత్రమే!**

**PATASALA**
**CHOWDEPALLE — 517 257 CHITTOOR Dt. A.P.**